క్లుప్తంగా

ఓటు హక్కు నమోదుకు నేటితో ముగియనున్న గడువు

రాజుపాలెం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా గ్రాడియేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదుకు నేటితో గడువు ముగుస్తున్నట్లు తహసీల్దారు దుర్గేష్‌రావు మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే పట్టభద్రులు సాయంత్రం 5 గంటల లోపు ఫారం–18 పూర్తి చేసి తహసీల్దారు కార్యాలయంలో అందించవచ్చని తెలిపారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, ఓడీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఓటరు కార్డు, ఆధారు కార్డుల జిరాక్సులపై గెజిటెడ్ సంతకంతో దరఖాస్తు ఫారంకు జత చేయాలని తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

సత్తెనపల్లి: పట్టణంలోని పలు పండ్ల బళ్లను, షాపులను ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా పండ్లు నిగనిగలాడేలా కనిపించేందుకు అక్రమ పద్ధతులకు పాల్పడితే శాఖాపరమైన, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

హాకీ జిల్లా జట్టుకు పెదకూరపాడు విద్యార్థులు



పెదకూరపాడు: అండర్–19 జిల్లా హాకీ జట్టుకు పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు మంగళవారం తెలిపారు. ఈ నెల 4న నందిగామలో నిర్వహించిన అండర్–19 స్కూల్ గేమ్ జట్టుకి పెదకూరపాడు నుంచి ముగ్గురు బాలికలు, బాలురు ఒకరు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 16 నుంచి కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులు చక్కగా రాణించి గుంటూరు జిల్లా జట్టుకి మంచి పేరు తేవాలని హెచ్ఎం అన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సిబ్బంది లేక వెలవెల



రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి గ్రామ సచివాలయంలో ఖాళీ కుర్చీలు ప్రజలకు దర్శనమిస్తున్నాయి. మంగళవారం సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో పనిపై వచ్చిన గ్రామస్తులు వెనుదిరిగి వెళ్లారు. సమాధానం చెప్పడానికి కూడా ఎవ్వరూ లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ

నకరికల్లు: గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని డీఆర్‌పీ ఆదినారాయణ సూచించారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో ఉపాధిపనులపై సామాజిక తనిఖీ బృందం మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. కూలీలకు రూ.25 లక్షలు, మెటీరియల్‌కు రూ.15 లక్షలు మొత్తం రూ.40 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. ఉపాధి కూలీలు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు నమోదు చేసుకొని ప్రజావేదికలో వెల్లడిస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రామకోటమ్మ, డీఆర్‌పీ ఎస్.తిరుపాలు, కైపు రవీంద్రారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

బెల్లంకొండ: మండల పరిధిలోని పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఓటరు నమోదుకు గడువు 6వ తేదీతో ముగుస్తుందన్నారు. డిగ్రీ లేదా తత్సమాన విద్యలో అర్హత ఉన్న వారంతా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫారం–18 పూర్తి చేసి నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో గానీ, తహసీల్దార్ కార్యాలయంలో గానీ నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

బెల్లంకొండ: వరిలో పొడ, ఎండు తెగుళ్ల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, పత్తి పంట పొలాలను సందర్శించారు. వరిలో పాము పొడ తెగులు గట్ల వెంట ఉన్న దుబ్బులకు ఆశించి మిగతా దుబ్బులకు కూడా పాకుతుందని తెలిపారు. తెగులు నివారణకు వ్యాలీడామైసిన్ 400 మి.లీ లేదా హెక్సాకోనజోల్ 400 మి.లీ, 18 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ ఒక ఎకరాకు మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంధనం లేక.. వాహనం కదలక

అప్పుల్లో అత్యవసర సేవలు

- కూటమి పాలనలో 108 సేవలకు గ్రహణం
- గత పది రోజులుగా డీజిల్ బిల్లులు మంజూరు లేక ఇక్కట్లు
- డీజిల్‌కు అప్పు కోసం పిడుగురాళ్ల, గురజాల, పేరేచర్ల, చిలకలూరిపేట బంకులకు పరుగులు
- నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాల్లేని వైనం



నిరుపయోగంగా ఉన్న 108 వాహనం (పాత చిత్రం)

నకరికల్లు : ఆపద సమయంలో బాధితులకు కొండంత అండగా ఉంటూ అత్యవసర సేవలందించే 108కు 100 రోజుల కూటమి పాలనలో గ్రహణం పట్టింది. రోడ్డుపై ప్రమాదం జరిగినా, ఇంటి వద్ద అనారోగ్యం ఏర్పడినా పైసా ఖర్చులేకుండా ఒక్క ఫోన్ కాల్‌తో నిమిషాల్లో మన చెంతకు వచ్చి ఆసుపత్రిలో చేర్పించే వరకు ఆప్యాయతతో కూడిన ఉచిత సేవలు అందిస్తుంది 108. రోడ్డుపై యాక్సిడెంట్ జరిగితే మనకెందుకులే అనుకునే గత రోజుల నుంచి ఒక్క ఫోన్ చేసి సాయం చేస్తే వాళ్లే ఆసుపత్రిలో చేరుస్తారు కదా అన్న స్థితికి ప్రజల ఆలోచన మారిందంటే అది 108 పుణ్యమే. ఆగస్టు మాసం 2005 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పుణ్యాన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 108 సేవలు ప్రారంభమయ్యాయి. మండలానికి ఒక వాహనం చొప్పున ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ లక్షలాది మంది అభాగ్యుల ప్రాణాలను నిలబెడుతుంది 108.

డీజిల్ లేక..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 100 రోజుల పాలన అంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. అధికారం వచ్చాక వారు ప్రజల కోసం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చెప్పడం మానేసి గత ప్రభుత్వం పేరెత్తుతూ కాలయాపన చేస్తున్నారు అధికార పార్టీ నాయకులు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిన గొప్ప పథకాల్లో 108 కూడా చేరింది. గత 10 రోజులుగా 108 వాహనానికి డీజిల్ కూడా కరువైంది. డీజిల్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో వాహనం ముందుకు కదలలేని పరిస్థితి దాపురించింది. కొన్ని పెట్రోల్ బంకుల్లో డీజిల్ అప్పు పోయకపోవడంతో సేవలు నిలిపేయడానికి మనసొప్పక సిబ్బంది నానా యాతన పడుతున్నారు. డీజిల్ ఎక్కడ అప్పు ఇస్తారా అని ఆరా తీసి పిడుగురాళ్ల, గురజాల, పేరేచర్ల, చిలకలూరిపేటలోని పెట్రోల్ బంకులకు వెళ్లి యజమానులను బతిమిలాడుకొని డీజిల్ నింపుకొని వచ్చి బాధితులకు సేవలందిస్తున్నారు. వారు కూడా ఇంకో రెండు మూడు రోజుల కన్నా ఎక్కువ అప్పు ఇవ్వలేమన్న పరిస్థితి ఏర్పడింది. విమర్శలు చేయడం తప్ప అత్యవసర సేవలందించే 108 డీజిల్ బిల్లులు మంజూరు చేసే విషయం ఏ ప్రజాప్రతినిధి నోటా రాకపోవడం దురదృష్టకరం. కనీసం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో కూడా 108కు డీజిల్ లభ్యం కాకపోవడం కూటమి పాలనకు నిదర్శనం.

జీతాలివ్వక నాలుగు నెలలు

108 వాహనంలో పైలెట్‌గా పిలువబడే డ్రైవర్, ఈఎంటీగా పిలువబడే మెడికల్ టెక్నీషియన్ విధులు నిర్వర్తిస్తుంటారు. వీరికి జీతం తప్ప మరొక ఉపాధి అవకాశం ఉండదు. ఎమర్జెన్సీ సేవల్లో ఉండే 108 సిబ్బందికి గత నాలుగు మాసాలుగా జీతాలివ్వకపోవడంతో ఈ పాలన ఎటువైపు వెళ్తుందనేది అర్థమవుతుంది. జీతాలతో పాటు ఇంక్రిమెంట్లకు కూడా గండి పెట్టారని సిబ్బంది వాపోతున్నారు. జీతమందక సిబ్బంది సంఖ్య కూడా తగ్గుతున్నట్లు సమాచారం. ప్రజల ప్రాణాలు పోకుండా కాపాడే 108 సిబ్బందికే జీతాలు లేకపోవడంపై ప్రజలు సైతం పాలనపై మండిపడుతున్నారు. అప్పులతో కాలం వెళ్లదీస్తున్నామని సత్వరమే వేతనాలు మంజూరు చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

ఉన్నత విద్యనభ్యసించేలా ఆడపిల్లలను ప్రోత్సహించాలి

డీసీడీవో ప్రశాంత్



సత్తెనపల్లి: ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని పల్నాడు జిల్లా డీసీడీవో ప్రశాంత్ అన్నారు. పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం బేటి బచావో–బేటి పఢావో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తెనపల్లి సీడీపీవో టీ శ్రీలత అధ్యక్షత వహించారు. డీసీడీవో ప్రశాంత్ మాట్లాడుతూ ఆడపిల్లల హక్కులు వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. బాల్యవివాహాలు, అక్రమ రవాణా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ ఆసియా, డాక్టర్ ధర్మతేజ, ఏసీడీపీవో సంతోషకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.ప్రమీల, పట్టణంలోని అన్ని సచివాలయాల ఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



సత్తెనపలి శివాలయంలో నాగేంద్రుని పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు



సత్తెనపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



హుస్సేన్ నగరంలో నాగుల చవితి



పూజలు అందుకుంటున్న సుబ్రహ్మణ్యస్వామి



అచ్చంపేటలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి

సత్తెనపల్లి: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు నాగేంద్రుని మంగళవారం భక్తి శ్రద్ధలతో పూజించారు. పుట్టల వద్ద చేరుకుని పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. తమ తమ విన్నపాలను మొరపెట్టుకున్నారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, శివాలయం వీధిలో గల సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో, పెదమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంతో పాటు పలు ఆలయాల్లో నాగేంద్రుని పుట్టల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాలు పోశారు. అనంతరం హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివనామ స్మరణతో శివయ్యకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రోసూరు: నాగుల చవితి పురస్కరించుకుని భక్తులు నాగేంద్రస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. క్రోసూరులోని అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద ఉన్న నాగుల పుట్ట వద్దకు భక్తులు ఉదయమే చేరుకుని పుట్టలో పాలు పోసి పండ్లు నైవేద్యంగా పెట్టారు. అదేవిధంగా అనంతవరం, దొడ్లేరు, గ్రామాల్లో నాగుల చవితిని ఘనంగా నిర్వహించారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: మండలంలో నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు తెల్లవారు జాము నుంచే శివాలయాలకు క్యూ కట్టారు. పుట్టలో పాలు పోసి స్వామి వారిని దర్శించుకున్నారు. సూర్యోదయానికి ముందే ఆకాశంలో తూర్పుదిక్కున నాగపాము నక్షత్ర రూపంలో దర్శనమిస్తుందని, ఆ సమయంలో పుట్టలో పాలు పోసి స్వామి వారికి చలిమిడి, నువ్వులతో చేసిన తీపి పదార్థాలు మొదలైనవి నైవేద్యంగా సమర్పిస్తే మంచిదని భక్తుల నమ్మకం. స్థానిక హరిహర క్షేత్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నీలేశ్వరపాలెంలోని నీలకంఠేశ్వస్వామివారి దేవాలయం, చామర్రు శివాలయం, మాదిపాడు శివాలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పరమశివుని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పెదకూరపాడు: మండల పరిధిలోని హుస్సేన్‌నగరం గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి, సుబ్రమణ్యస్వామికి మంగళవారం నాగుల చవితి పర్వదినాన ఉదయం 5.00 గంటల నుంచి విశేషంగా అభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక పూజలు ఆధ్యాత్మిక గురువులు వేద పండితులు శ్రీపతి బాలకృష్ణవార్యులు నిర్వహించారు. భక్తులందరికీ స్వామి వార్ల అనుగ్రహం కలిగి సకల శుభములు కలగాలని ఆయన అన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని బెల్లంకొండ, చంద్రాజుపాలెం, గంగిరెడ్డిపాలెం, వెంకటాయపాలెం, పాపాయపాలెం, మాచాయపాలెం గ్రామాలలో చవితిని నిర్వహించారు. వేకువజామునే నిద్రలేచి పుణ్య స్నానాలు ఆచరించి, నాగేంద్ర స్వామి విగ్రహాలకు, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసి, పుట్టలో పాలు పోశారు. వెంకటాయపాలెం గ్రామంలో మహిళలు గ్రామంలోని ఆలయాలలో దేవతల విగ్రహాలకు జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగమయ్య పుట్ట వద్దకు వెళ్లి పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలు చేశారు.

ఆశా కార్యకర్తల ధర్నాను జయప్రదం చేయాలి

సీఐటీయూ మండల కార్యదర్శి పెండ్యాల మహేష్



డాక్టర్ కవితకు వినతిపత్రం అందిస్తున్న పెండ్యాల మహేష్, ఆశ కార్యకర్తలు

సత్తెనపల్లి: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ పిలుపులో భాగంగా మంగళవారం పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ యూఎస్ఎల్ కవితకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇటీవల అనేక మంది ఆశా కార్యకర్తలను రిటైర్మెంట్ చేశారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా అందడం లేదని, చనిపోయిన ఆశా కార్యకర్తలకు బీమా సౌకర్యం వర్తించడం లేదన్నారు. ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్ పని చేయని సెల్ ఫోన్స్‌తో మెజారిటీ ఆశా కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సెలవు కోసం అధికారుల దయా దాక్షిణ్యాలపై ఆధార పడవలసి వస్తుందన్నారు. కొత్త రికార్డ్స్ ఏప్రిల్ ఒకటి నుంచి నిర్వహించాల్సి ఉండగా నేటి వరకు సరఫరా చేయలేదని, గ్రామాల్లో ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు షారోను, పద్మజ, రాధాకుమారి, మరియమ్మ, కమల, రుక్మిణి తదితరులు ఉన్నారు.

సీసీఐ నిబంధనలు సడలించేందుకు కృషి చేస్తా

- సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ
- సత్తెనపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: రైతులు సాగు చేసి పండించిన పత్తిని మద్దతు ధరకు విక్రయించుకునేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో రైతులకు కలగనున్న ఇబ్బందుల్ని అసెంబ్లీ సమావేశాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. పట్టణంలోని అమరావతి మేజర్ కాలువ వద్ద గల లక్ష్మీ కాటన్ ట్రేడ్ మిల్‌లో మంగళవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉంటేనే సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేస్తారని, 12 శాతం దాటితే బయ్యర్లు సరుకు వెనక్కి పంపిస్తారన్నారు. ప్లాస్టిక్ గోతాల్లో కాకుండా లూజుగా పత్తి సీసీఐ కేంద్రాలకు రైతులు తీసుకురావాలన్నారు. గతంలో లేని విధంగా సీసీఐ కఠిన నిబంధనలను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి ఆయన ద్వారా సీఎం చంద్రబాబుతో మాట్లాడతానన్నారు. రైతులకు మేలు చేసేలా నిబంధనలు సడలించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులు కూడా తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. నియోజకవర్గంలో పత్తి పంట సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్ర సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సీసీఐ బయ్యర్ తదితరులు ఉన్నారు.

వరిలో సమీకృత వ్యవసాయ విధానం పాటించాలి



ప్రకృతి వ్యవసాయంపై సూచనలిస్తున్న అధికారులు

దొడ్లేరు (క్రోసూరు): వరి సాగులో సమీకృత వ్యవసాయ విధానాన్ని పాటించాల్సిన అవసరం ఉందని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కే రామచంద్రన్ అన్నారు. మంగళవారం క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు వెంకటలక్ష్మి వరి వ్యవసాయ క్షేత్రాన్ని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ రామచంద్రన్, జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్‌రాజు సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ వరి ఎకరం పొలంలో ఎల్ ఆకారంలో గట్టును 5 అడుగుల వెడల్పుతో చేయడం ద్వారా ఆ గట్టుపై వరుసగా ఆకుకూరలు, కూరగాయలు వేసుకోవచ్చన్నారు. దీంతో వరి పంటకు అయ్యే పెట్టుబడి మొత్తం గట్లపై వేసిన వివిధ రకాల మొక్కల ద్వారా లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాలు రైతులు తయారు చేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చున్నారు. డీపీఎంయూ సిబ్బంది సైదయ్య, నందకుమార్, జయల, సావిత్రి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

నార్నెపాడు(ముప్పాళ్ళ): వరిలో సమీకృత వ్యవసాయ విధానం పాటించటం వలన పెట్టుబడి తగ్గించుకొని ఆదాయం పెంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ కె.రామచంద్రన్ చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో సాగు చేసిన ఏటీఎం తరహా వ్యవసాయ క్షేత్రాలను ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారితో కలిసి మంగళవారం పరిశీలించారు. వరి పంట నుంచి వచ్చే ఆదాయం రైతుకి నికర ఆదాయంగా మిగులుతుందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ మిరపలో అంతర పంటలుగా ఉల్లి, ముల్లంగి, క్యారెట్, కొత్తిమీర, బంతి మొక్కలను వేసుకోవడం వలన చీడపీడలు తక్కువగా వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్‌రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో మెళకువలు పాటించాలి

నకరికల్లు: మొక్కజొన్న సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చులో గణనీయమైన దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని నర్సింగపాడు, కుంకలగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎకరాకు 8 కిలోల చొప్పున మొక్కజొన్న విత్తనాలు నాటాలన్నారు. వరుసల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 20 సెంటీమీటర్ల దూరం ఉండేలా నాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సర్పంచ్ మార్తమ్మ మట్టయ్య, వ్యవసాయ సహాయకులు ఎం.డి.జాన్‌అహ్మద్, షేక్.నవాజ్‌షరీఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, అంటువ్యాధులపై అవగాహన తప్పనిసరి



సత్తెనపల్లి: హెచ్‌ఐవీ, అంటువ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీము జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వర అన్నారు. హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు, ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలలపాటు న్యాకో(ఎన్ఏసీఓ) నేతృత్వంలో 'మీకు తెలుసా' రాష్ట్ర స్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం పణిదం పీహెచ్‌సీలో చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీము, అడ్వకసీ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వర మాట్లాడుతూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీము ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో పనిచేస్తున్నామని, ఈ ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ ద్వారా పల్నాడు జిల్లాలోని 55 గ్రామాలలో 8 వారాల పాటు హెచ్‌ఐవీ, టీబీ సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు, ఐఈసీ మెటీరియల్స్, ఫ్రీ కండోమ్ డిస్ట్రిబ్యూషన్, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లక్ష్మీ కవిత హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, టీబీ, సుఖవ్యాధులు, హెచ్‌ఐవీ పరీక్ష ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఎస్ వరలక్ష్మి మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితుల పట్ల చిన్నచూపు, వివక్షతను చూపరాదన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, లింక్ వర్కర్‌లు పాల్గొన్నారు.

పత్తి విక్రయానికి రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలి



సత్తెనపల్లి: సీసీఐలో పత్తి విక్రయానికి రైతు సేవా కేంద్రంలో రైతులు పేర్లను నమోదు చేయించుకోవాలని ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. ధూళిపాళ్ళ, కంకణాలపల్లి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పత్తి పంట కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521 చొప్పున కొనుగోలు చేయుటకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందన్నారు. పత్తిలో తేమ 8 –12 శాతం వరకు మాత్రమే ఉండాలన్నారు. రైతులు బోరాలుగా కాకుండా పత్తిని లూజు పద్ధతిలో కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొని రావాలన్నారు. ప్లాస్టిక్ సంచులలో తీసుకొని వచ్చినట్లయితే కొనుగోలు చేయరన్నారు. పులువురు రైతుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి



రాజుపాలెం: ప్రభుత్వం కేటాయించిన కాటన్ మిల్లులలోనే రైతులు పత్తిని అమ్ముకోవాలని, అప్పుడే ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర వస్తుందని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యాలయంలో రైతులకు పత్తి విక్రయంపై, పంటల బీమాపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులు దళారీలను నమ్మి పత్తిని అమ్ముకోవద్దని తెలిపారు. సత్తెనపల్లిలోని లక్ష్మీకాటన్ మిల్లులోను, ధూళిపాళ్ల రాయని కాటన్ మిల్లులోను పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 లోపు ఉండాలని చెప్పారు. రబీ సీజన్‌లో వరి వేసే రైతులు ఎకరాకు రూ.630 చెల్లించినట్లయితే పంట బీమా వర్తిస్తుందని, 15వ తేదీ లోపు గ్రామ సచివాలయాలలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.